దేవాలయాలకు రక్షణ కల్పించాలి


ఉప్పల్ డిపో వద్ద ధర్నా చేస్తున్న ప్రజలు

హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ బస్ డిపో వద్ద వరంగల్ జాతీయ ప్రధాన రహదారిపై విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ, బీజేపీ, బజరంగదళ్, ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మగుడిపై దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ.. ముష్కరుల దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను మనమే కాపాడుకోవాలని విశ్వహిందూ పరిషత్ ద్వారా సమాజానికి నమ్మకం కలిగించేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ ఉప్పల్ జిల్లా అధ్యక్షుడు ముక్తా నాగరమేష్‌నాయుడు, బీజేపీ నేతలు బండారి పవన్, కరుణాకర్‌రెడ్డి, వివిధ హిందూ ధార్మిక సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయాలి..

అల్వాల్: రాష్ట్రంలో గత కొన్ని నెలలుగా హిందూ దేవాలయాలే లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్న ఘటనలపై సిట్ ఏర్పాటు చేయాలని వీహెచ్‌పీ సభ్యులు మల్కాజిగిరి ఆర్‌డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ సభ్యులు మాట్లాడుతూ.. ఇటీవల సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ గుడి ఘటనపై ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వీహెచ్‌పీ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు రామనర్సింహులు, కార్యదర్శి రజినీకాంత్, బజరంగ్‌దళ్ కన్వీనర్ నందకిషోర్, అధికారులు సరళ, పస్యంతి, రాజిరెడ్డి, మనిమారన్, నాగభూషణం, ఉదయ్, ప్రకాష్, ఘనశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం


అధికారులతో మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్‌లో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు ఉప్పల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల రజితా పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ శ్రీనగర్ కాలనీ చౌరస్తాలో మురుగు సమస్యపై పలుమార్లు సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు శ్రీనగర్ కాలనీ చౌరస్తా వద్ద మురుగుకు శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. పరమేశ్వర్‌రెడ్డితో పాటు, జీహెచ్‌ఎంసీ ఈఈ హరిలాల్, జలమండలి అధికారులు, ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి పరిస్థితిని సమీక్షించారు. జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులను సమన్వయం చేసి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

ఓపెన్‌జిమ్ స్థల పరిశీలన

హబ్సిగూడ: ప్రజలకు ఉపయోగపడేలా ఓపెన్ జిమ్ ఉండాలని హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్ అన్నారు. శనివారం హబ్సిగూడ డివిజన్ పరిధిలోని మధురానగర్ పార్క్‌ను ఆమె సందర్శించారు. పార్క్‌లో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేసే స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. వెంకట్‌రెడ్డినగర్‌లోని వీధి నెంబర్ 8,9లలో సీసీరోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. డీఈ నాగమణి, ఏఈ సాయికిరణ్ పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ చేతనాహరీష్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : ఎమ్మెల్యే


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలు సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ సీనియర్ నేతలు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, నాయకులు రహీం తదితరులు పాల్గొన్నారు.

చెక్క గానుగ నూనెపై విద్యార్థులకు అవగాహన



మల్కాజిగిరి: కల్తీ నూనెల వాడకం వలన వచ్చే వ్యాధుల బారిన పడకుండా సంప్రదాయ పద్ధతుల్లో తీసే గానుగ నూనె దానివలన ఉపయోగాలపై మల్కాజిగిరిలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిశ్రమ నిర్వహిస్తున్న ఆయుశ్రిత నేషనల్ నిర్వాహకుడు జగదీష్ మాట్లాడుతూ.. పాతకాలం పద్ధతిలో రోట్లో వేరుశనగలు వేసి ఎద్దును తిప్పడం ద్వారా (గానుగపట్టి) నూనెను తీస్తున్నామని, ఈ నూనెను వాడటం వలన పోషకాలు ఎక్కువగా లభ్యమవుతాయన్నారు. మార్కెట్‌లో కల్తీ నూనెల వాడకం ఎక్కువగా జరుగుతున్నదని దానిని సులువుగా గుర్తించవచ్చునన్నారు. మనిషి శరీరంపై ఒక చుక్క మార్కెట్‌లో లభించే నూనె వేస్తే అలాగే ఉంటుందని, అదే గానుగ ద్వారా తీసిన నూనె వేస్తే శరీరం పీల్చుకుంటుందన్నారు.వినియోగదారులు స్వయంగా పల్లీలు తీసుకుని వచ్చినా ఆడించి ఇస్తామన్నారు. సుమారుగా 196 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా షోడశ వార్షిక బ్రహ్మోత్సవాలు

మల్లాపూర్: నాచారం హెచ్ఎంటీనగర్‌లోని శ్రీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం షోడశ వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ దుర్గాప్రసాద్, ఆలయ కమిటీ అధ్యక్షులు రాంచందర్‌రావు, కార్యదర్శి వేంకటేశ్వర్లు, లక్ష్మణ్‌రాజ్, గోపాల్‌రెడ్డి, శేషారెడ్డి, అప్పారావు, రాంబాబు, మహంకాళి దేవాలయం చైర్మన్ కృష్ణారెడ్డి, డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్, రాంరెడ్డి, అశ్వద్ధామరెడ్డి, హెచ్ఆర్ మోహన్, రాజు, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ధ్వజారోహణలో పాల్గొన్న మందముల పరమేశ్వర్‌రెడ్డి

ప్రతి కార్యకర్తను కాపాడుకుంటాం

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రామచందర్‌నాయక్ భార్య తులసి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. మెరుగైన చికిత్సకు ఎలాంటి సాయం కావాలన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి


వ్యర్థాలతో నిండిన చిన్న చెరువు

డంపింగ్ యార్డులా చిన్న చెరువు !

రామంతాపూర్: బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మలను చిన్న చెరువులోనే నిమజ్జనం చేశారు. దీంతో పూల వ్యర్థాలు, ఇతర వ్యర్థాలతో పాటు స్థానికులు ప్లాస్టిక్ కవర్లలో మూటలు కట్టి చెరువులో విసిరేస్తున్నారు. రోజుల తరబడి చెరువులోని చెత్తను జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది తొలగించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని లేదంటే సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శ్రవణ్

రూ.46 లక్షలతో అభివృద్ధి పనులు

మల్కాజిగిరి: భగత్‌సింగ్‌నగర్‌లో అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ శనివారం ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో రోడ్లు దెబ్బతిన్నాయని, డ్రైనేజీ వ్యవస్థ కూడా సరిగ్గా లేకపోవడంతో కాలనీ ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. సుమారు రూ.46 లక్షలతో సీసీరోడ్లు, యూజీడీ నిర్మాణం ప్రారంభించామని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. సంతోష్, సాయిగౌడ్, విమలమ్మ, శ్రీదేవి, స్వరూప, మురళి, రవి పాల్గొన్నారు.

శబరిమల ప్రధాన పూజారి ఆశీర్వాదం


ఆలయ ప్రధాన పూజారితో సతీష్‌రెడ్డి

కాప్రా: కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయ ప్రధాన పూజారిని కాప్రా డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్‌రెడ్డి కలిశారు. శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం అనంతరం ప్రధాన పూజారులను కలిసి ఆశీర్వచనం పొందారు. ఈ సందర్భంగా పూజారులను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన

సాక్షి,సిటీబ్యూరో: రోడ్డు ప్రమాదాలు నివారించటానికి రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి రఘునందన్‌గౌడ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ ప్రజావాణి హాలులో రోడ్డు ప్రమాదాలు-భద్రతపై డ్రైవర్లు, ఉద్యోగులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ఆయన పేర్కొన్నారు. మద్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. మూల మలుపుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, అతి వేగాన్ని అరికట్టాలన్నారు. జిల్లా ట్రాన్స్‌పోర్ట్ శాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ ధీరేంద్రసామినేని, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రామ్‌మోహన్, జిల్లా స్పోర్ట్స్ అధికారి గోపాల్‌రావు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై ఉద్యోగులు, డ్రైవర్‌లకు అవగాహన కల్పించటంతోపాటు శిక్షణ కూడా ఇచ్చారు.

పరీక్ష కేంద్రాల పర్యవేక్షణ

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణలో భాగంగా శనివారం మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో కూకట్‌పల్లి, మేడ్చల్, దూలపల్లి తదితర ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించటంతోపాటు పలు సూచనలు చేశారు.

నూతన వీసీకి అభినందనల వెల్లువ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నూతన వీసీ ప్రొ.కుమార్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం మాదిగ విద్యార్థి ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) జాతీయ కార్యదర్శి సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో వీసీని కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఓయూకు తొలిసారి మాదిగ ప్రొఫెసర్ వీసీగా నియమితులవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రం నాగేంద్రం, రఘువరణ మాదిగ, వెంకటేశ్ మాదిగ, నాజీవ్, ప్రదీప్, మహేందర్, విజయ్, అంజి, రవి మాదిగ తదితరుపాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



సనత్‌నగర్: దివ్యాంగుడైన బాలుడు అదృశ్యమైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కృష్ణాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. భరత్‌నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నరేశ్ స్థానికంగా శ్రీసత్యసాయి కృప హోమ్స్ పేరిట అనాథ ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నాడు. అందులో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో కృపహోమ్‌కు చెందిన నర్సింహ (14) బేగంపేటలోని శ్రద్ధ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం 8.10 గంటలకు శివాలయానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో నరేశ్ స్థానికంగా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

మౌలాలి : 138వ మౌలాలి డివిజన్ ఓల్డ్ సఫిల్‌గూడ దర్గా రాక్ చర్చి రోడ్డు, సౌత్ సుధానగర్‌కాలనీలో 11 మీటర్ల సీసీరోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాలేదు. 140 మీటర్ల సీసీరోడ్డు పనులపై పలుమార్లు మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. సౌత్ సుధాకర్‌నగర్ కాలనీ అధ్యక్షులు బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు, బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి, డాక్టర్ ప్రసాద్‌తో కలిసి జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ ఆఫీసులో జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు మెమోరాండం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో చర్చించి పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తానని హామీనిచ్చారన్నారు.


జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న బీసీ కులాల ఐక్య వేదిక సభ్యులు

అభివృద్ధి పనుల పరిశీలన

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో మంజూరైనా భవానీనగర్, అంబేడ్కర్‌నగర్ పోచమ్మ గుడి దగ్గర మంజూరైనా బిడ్జి నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులకు నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ సూచించారు. శనివారం నాచారంలో బిడ్జిలను అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవానీనగర్ ప్రధాన రోడ్డులో ఉన్న పాత బిడ్జి స్థానంలో నూతన వంతెన కోసం రూ.94 లక్షలు మంజూరయ్యాయని, అంబేడ్కనగర్‌లో వంతెనకు రూ.54 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. ఈ పనులను ఒకేసారి ప్రారంభించాలని అధికారులను కోరారు. ఈఈ నాగేందర్, డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


నాచారంలో పాత వంతెనను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

గంజాయి విక్రేత అరెస్ట్

ఉప్పల్: గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఉప్పల్ ఎక్సైజ్ సీఐ ఓంకార్ శనివారం సాయంత్రం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల ప్రకారం.. నార్త్ లాలాగూడ ప్రాంతానికి చెందిన ఇమ్మడి సాయికిరణ్ అలియాస్ జాన్ జల్సాలకు అలవాటు పడి గంజాయి విక్రేతగా మారాడు. ఒడిశా సరిహద్దు నుంచి నగరానికి గంజాయితో వస్తున్నాడన్న సమాచారంతో ఉప్పల్‌లో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి కిలో గంజాయి, బుల్లెట్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

మల్కాజిగిరి: సెల్‌ఫోన్ చూస్తున్న విద్యార్థిని తల్లి, అన్న మందలించారని మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి మీర్జాలగూడకు చెందిన సత్యనారాయణ కుమార్తె జ్యోతిక(18) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈనెల 18న రాత్రి సెల్‌ఫోన్ చూస్తుంటే మందలించారు. దీంతో గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. వెంటనే గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శివాంశ డాన్స్ అకాడమీ గురువు శివకుమార్ శిష్యబృందం చే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. వినాయక కౌతం, బ్రహ్మాంజలి, గజవదాన, నమశ్శివాయతే కొండల్లో నెలకొన్న, జగదానంద కారక, తదితర అంశాలను సుజయ్, సిరి వెన్నల, కౌశిక, మోక్ష తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

రక్తదానం.. ప్రాణదానం

బోడుప్పల్: అవసరమైన వారికి రక్తం దానం చేసి ప్రాణదాతలు కావాలని జయసింహ ఫౌండేషన్ వ్యవస్థాపకలు జయసింహ అన్నారు. బోడుప్పల్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ నారాయణగూడ బ్లడ్ బ్యాంక్, జయసింహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత కొంత కాలంగా విష జ్వరాల వల్ల నగరంలో రక్తం కొరత ఉందని, రోగులకు ఎంతో ఉపయోగపడుతందన్నారు. ప్రతి ఒక్కరూ రక్తం దానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. ఈ శిబిరంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు.


రక్తదాన శిబిరంలో పాల్గొన్న జయసింహ

పదేళ్ల మోదీ పాలనలో దేశం సురక్షితం : ఎంపీ ఈటల రాజేందర్


సభ్యత్వ నమోదులో ఈటల రాజేందర్

మల్కాజిగిరి: పదేళ్ల మోదీ పాలనతో భారతదేశం ప్రశాంతంగా ఉందని బాంబులు లేని పాలన కొనసాగిందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో పార్టీ సీనియర్ నాయకుడు బక్క నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ.. ఓట్ల కోసం,సీట్ల కోసం ఉన్మాదులను పోషిస్తే పాముకు పాలు పోసినట్లేనన్నారు. ఈ విషయాన్ని ఇక్కడి పాలకులు గుర్తుంచుకోవాలని సురక్షిత, సుభిక్ష భారత్‌ను విచ్ఛిన్నం చేసేందుకు కీలకమైన హైదరాబాద్‌లో అశాంతిని నెలకొల్పేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. దేవాలయాల మీద దాడులు జరగడాన్ని సహించలేమన్నారు. అనేక దేశాల్లో ఉన్మాదంతో సామాన్య ప్రజలు బలి అవుతున్నారని, మనం అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్మాదానికి అడ్డుకట్ట వేయకపోతే కేంద్రం చూస్తూ ఊరుకోదన్నారు. దేశం సురక్షితంగా ఉండాలనేదే మోదీ కర్తవ్యమని అందుకు బాసటగా బీజేపీని బలోపేతం చేయడానికి సభ్యత్వం తీసుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్లు శ్రవణ్, సునీతాయాదవ్, నాయకులు డీఎస్. వెంకటేష్‌యాదవ్, వీకే మహేష్, వాశంశెట్టి శ్రీనివాస్, నర్సింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి ఆహ్వానం


ఎంపీ ఈటలకు ఆహ్వానం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో ఈనెల 25,26,27 తేదీల్లో జరగనున్న విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పాతగాని గోపాల్‌గౌడ్, చారి, చంద్రమౌళి, చంద్రశేఖర్, రాజిరెడ్డి, శ్రీనివాస్‌నాయక్, అశోక్, శేఖర్‌గుప్తా, సురేందర్, రమేష్ ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ నాచారం సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పారిశ్రామికవాడలోని ముత మెటెల్ ఫీడర్ పరిధిలోని రోడ్‌నెంబర్ 09,12 ఐడీఏ నాచారంలో విద్యుత్ సరఫరా ఉండదని నాచారం ఏఈ నాగరాజు తెలిపారు. మల్టీ స్టీల్ ఫీడర్ పరిధి మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పారిశ్రామికవాడలోని రోడ్ నెంబర్ 7,8లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

ఆర్ట్స్, క్రాఫ్ట్స్‌పై శిక్షణ తరగతులు


నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌పై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శించగా.. వారిని పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు ఆర్ట్స్, క్రాఫ్ట్‌లో ప్రావీణ్యత సాధించాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు రాము, నళిని, హేమ, నవనీత పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


సన్మాన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి తదితరులు

ఉప్పల్: మండల పరిధిలో పదవీవిరమణ చేయబోతున్న ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి రామారావు ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. ప్రేమ్‌కుమార్, మైఖిల్‌రెడ్డి, ఆంజనేయులు, నీరజ, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.